క్లుప్తంగా

23న గెట్ టు గెదర్

ఒంగోలు రూరల్: ఈ నెల 23న గెట్ టూ గెదర్ రెండో వార్షికోత్సవం కరవది జెడ్పీ హైస్కూలు ప్రాంగణంలో జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా పరిషత్ హైస్కూలులో చదువుకున్న విద్యార్థులకు రెండో సంవత్సరం వార్షికోత్సవ సభ, విందు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం



మురుగునీటి కాలువల్లో కిరోసిన్ పోయిస్తున్న ఎంపీడీఓ అజిత, ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ

ఒంగోలు రూరల్: కార్యదర్శులు గ్రామ పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఒంగోలు ఎంపీడీవో పి.అజిత అన్నారు. ఉలిచి అంబేడ్కర్ బొమ్మ వద్ద గల కల్వర్టులను పరిశీలించారు. గృహాల్లోని చెత్తను మురుగు కాలువల్లో వేయడం వలన మురుగు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోందని.. పారిశుద్ధ్య కార్మికులకు అందజేయడం ద్వారా తమ ఇంటి ఆరోగ్యం గ్రామ ఆరోగ్యాన్ని కాపాడినవారవుతారన్నారు. డెంగీ లార్వాలు పాడుబడిన టైర్లలో, వాడిన కొబ్బరి బొండాల్లో, ప్లాస్టిక్ డబ్బాల్లో, మంచినీటి తొట్లల్లో వేగంగా వృద్ధి చెందుతుందన్నారు. టైర్లు, ట్యూబులు, కొబ్బరిబోండాలను కాల్చి వేయాలని తెలిపారు. ప్రధాన మురుగు కాలువల్లో కిరోసిన్, ఆయిల్ బాల్స్ స్వయంగా వేశారు. కార్యదర్శి సురేష్ కుమార్, ఏఎన్ఎం రజిని, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలి

ఒంగోలు: ఆగిపోయిన పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓవీ వీరారెడ్డి, రవి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పదోన్నతుల జాబితాలలో తప్పులు ఉన్నాయని, ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు వాయిదావేసి రెండు రోజులలో జరుపుతామని తెలియజేసిన జిల్లా విద్యాశాఖ అధికారి పది రోజులు గడుస్తున్నా జాబితాలు విడుదల చేయకపోవడం సరికాదన్నారు.

నేడు రైతుకూలీ సంఘ జిల్లా మహాసభలు

ఒంగోలు: రైతు కూలీ సంఘ జిల్లా మహాసభలు బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక వేమూరి కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు రైతు కూలీ సంఘ జిల్లా కార్యదర్శి లలిత కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలకు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులతోపాటు పలువురు రైతు సంఘాల ప్రతినిధులు కూడా హాజరవుతారన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభ సభ, అనంతరం ప్రతినిధుల సభ, చివరగా రైతు కూలీల ప్రదర్శన ఉంటుందన్నారు. రైతు సంఘాల ప్రతినిధులు, రైతు కూలీలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

ఏసీ, ఫ్రిజ్ రిపేర్‌లో ఉచిత శిక్షణ

టంగుటూరు: గ్రామీణాభివృద్ధి, స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఏసీ, ఫ్రిజ్ రిపేర్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి మంగవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు భాగ్యనగర్‌లో ఆగస్టు 3వ తేదీ నుంచి నెల రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి పూర్తిగా ఉచితమని, ప్రకాశం జిల్లాకు చెందిన 19 నుంచి 45 ఏళ్లలోపు మహిళలు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. వివరాలకు 9573363141ను సంప్రదించాలని సూచించారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

పామూరు: మండలంలోని మోపాడు బంగ్లా వద్ద నూతనంగా నిర్మించనున్న విద్యుత్ సబ్ స్టేషన్‌కు మంగళవారం విద్యుత్‌శాఖ ఒంగోలు కన్‌స్ట్రక్షన్ ఏడీ లక్ష్మీనారాయణ, స్థానిక ఏడీ టి.శ్రీకాంత్, ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య స్థానిక నాయకులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓవర్‌లోడ్ సమస్యను అధిగమించి వ్యవసాయానికి, గృహాలకు, వ్యాపార సముదాయాలకు మెరుగైన విద్యుత్‌సేవలు అందించేందుకు మోపాడుబంగ్లావద్ద నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేయనున్న 33/11 కేవీ సామర్థ్యం ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ సుమారు రు.4 కోట్ల నిర్మాణ వ్యయం కానుందన్నారు. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించి త్వరితగతిన పనులు పూర్తి చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, కోఆప్షన్ నాయబ్‌రసూల్, విద్యుత్‌శాఖ ఏఈ షేక్.జిలానీ, చప్పిడి అజయ్, జొన్నలగడ్డ గోవిందయ్య, బంగ్లా వాసులు, ఎనర్జీ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై ప్రత్యేక దృష్టి సారించండి



ఎమ్మెల్యేను గజమాలతో సత్కరిస్తున్న పార్టీ నాయకులు



పార్టీ నాయకులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: ఈనెల 21 నుంచి నియోజకవర్గంలో జరగనున్న ఓటర్ల జాబితా సవరణలపై పార్టీ నాయకులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తెలిపారు. మంగళవారం ఒంగోలులోని తన కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులతో మాట్లాడారు. ఓటర్ల జాబితాలో నూతన ఓట్లను చేర్పించటం, చనిపోయిన వారిని, వివాహాలు జరిగి వేరే గ్రామాలకు వెళ్ళిన మహిళల ఓట్లను తొలగించటంలో జాగ్రత్తలు వహించాలని వివరించారు. ఓటర్ల జాబితాపై ప్రత్యేక కమిటీలను నియమించుకుందామని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ మారెళ్ళ బంగారుబాబు, నాలుగు మండలాల కన్వీనర్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీజేఆర్ నియామకంపై హర్షం

శాసన సభ ప్రివిలేజ్ కమిటీ సభ్యునిగా, ఎస్సీ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులుగా సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు స్పీకర్ నియమించారు. దీంతో మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, దుంపా యలమందారెడ్డి, పేర్నమిట్ట డివిజన్‌లోని కార్పొరేటర్ల ఆధ్వర్యంలో గజమాలతో శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

మాగుంట సహకారంతో రోడ్ల మరమ్మతులు



కొత్తపట్నంలో ఉప్ప కొఠారు రోడ్డు పనులను పరిశీలిస్తున్న మాగుంట ట్రస్ట్ సభ్యులు

కొత్తపట్నం: ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి సహకారంతో, సొంత నిధులతో వేగంగా జరుగుతున్న రోడ్డు మరమ్మతులను మాగుంట ట్రస్ట్ ప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. రంగాయపాలెం పొలిమేర ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి ఉప్ప కొఠారు రోడ్డు జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. మండల వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడు ఆళ్ళ రవీంద్రరెడ్డి మాట్లాడారు. వారం రోజుల నుంచి మాగుంట సహకంతో పొక్లెయిన్‌తో రోడ్డును లెవలింగ్ చేయటం, చిల్ల చెట్లు తీసి వేయటం పనులు చేస్తున్నామన్నారు. మాగుంట ట్రస్ట్ సభ్యులు పమ్మి బంద్రారెడ్డి, డి.కృష్ణారెడ్డి, వాకా సంజీవరెడ్డి, గాలి ముసలారెడ్డి, దొడ్ల రాజుగోపాల్‌రెడ్డి, గాదె కోటిరెడ్డి, రైతులు రమేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తారు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ, మండల కన్వీనర్, ఏఈ

చీమకుర్తి: బండ్లమూడి–నాయుడుపాలెం మధ్య రూ.50 లక్షలతో చేపట్టిన తారు రోడ్డు నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. రెండు గ్రామాల మధ్య 1.3 కి.మీ పొడవున మండల పరిషత్ నిధులతో తారు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. దానిలో భాగంగా నిర్మిస్తున్న తారు రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ వీరాంజనేయులు పర్యవేక్షించారు. వర్షాకాలంలో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి రోడ్డు నిర్మాణం దోహదపడుతుందని స్థానిక ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న సురక్ష పథకం సమీక్ష



గద్దలగుంటలో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: జగనన్న సురక్ష పథకంలో నిర్వహిస్తున్న క్యాంపులపై ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు మంగళవారం సమీక్ష నిర్వహించారు. కమిషనర్ వెంకటేశ్వరరావు నగరంలోని మామిడిపాలెం, గద్దలగుంట–1, 2, కోటవీధి, వంటవాని కాలనీల్లోని సచివాలయాల్లో జగనన్న సురక్ష పథకంపై సమీక్షలు నిర్వహించారు. త్వరలో జరగనున్న జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించాల్సిన తీరుపై అధికారులు, సిబ్బంది, సంబంధిత కార్పొరేటర్లతో సమీక్ష జరిపారు. క్యాంపులకు సంబంధించిన ఏర్పాట్లు, వాటి తీరుతెన్నులపై పర్యవేక్షించారు. సచివాలయాల పరిధిలో డోర్ డోర్ సర్వే గురించి ఆరా తీశారు. 90 శాతం పూర్తికాని సర్వే ప్రాంతాల్లో వలంటీర్లు, సచివాయల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వేలో రిజిస్టరయిన లబ్ధిదారులకు క్యాంపులో సర్టిఫికెట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఖాదర్‌బాషా

టంగుటూరు: వాహనదారులు రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఖాదర్‌బాషా సూచించారు. స్థానిక టోల్ ప్లాజా వద్ద మంగళవారం రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. రోడ్డు నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. హెల్మెట్, సీటుబెల్టు ధరించకుండా, అతివేగంగా వాహనాలు నడపడం వల్ల ఎక్కువ మంది ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్నారని తెలిపారు. అనంతరం వాహనాలకు రేడియం స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు



మాట్లాడుతున్న ఎస్‌బీసీసీ సెల్ జిల్లా కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్

హనుమంతునిపాడు: బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు ఉన్నాయని ఎస్‌బీసీసీ సెల్ జిల్లా కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వేములపాడు సచివాలయ పరిధిలోని మహమ్మదాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం గ్రామ సచివాలయ బాల్యవివాహాల నిరోధక కమిటీ సహకారంతో మండల న్యాయసేవాధికార సంస్థ, జిల్లా ఎస్‌బీసీసీ సెల్, గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ సంయుక్తంగా విద్య, ఆరోగ్యం, బాలికా వికాసం, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, బాల్యవివాహాల నిషేధ చట్టం 2006, బాలకార్మిక నిషేధ చట్టం, పోక్సో యాక్ట్ 2012పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం కె.నాగమణి, మహిళాపోలీస్ బాలరంగమ్మ, ఏఎన్ఎం కృష్ణకుమారి, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజ్యలక్ష్మి, ఎస్‌బీసీసీ సెల్ జిల్లా సభ్యులు, పారాలీగల్ వలంటీర్ గుడ్‌హెల్ప్ రమేష్‌బాబు, బీటీఏ నాయకులు దద్దాల శ్రీనివాసరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ నెల కొలుపులు

టంగుటూరు: టంగుటూరు గ్రామంలో పోలేరమ్మ కొలుపులు ముగిసి నెల రోజులు అయిన సందర్భంగా సోమవారం రాత్రి వైభవంగా నెల కొలుపులు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. రాత్రికి ఏడు ఎడ్ల బండ్లు కట్టి మేళ తాళాల నడుమ అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.



పోలేరమ్మ తల్లి గ్రామోత్సవానికి సిద్ధం చేసిన వాహనం

పీడీఎస్‌యూ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

ఒంగోలు: పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం స్థానిక పీడీఎస్‌యూ జిల్లా కార్యాలయంలో జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.రాజశేఖర్ మాట్లాడుతూ శిక్షణ తరగతులు ఈనెల 22,23 తేదీల్లో కడప నగరంలో జరుగుతాయన్నారు. మోదీ ప్రభుత్వం విద్యను భ్రష్టు పట్టించిందని విమర్శించారు. 2020 నూతన జాతీయ విద్యావిధానం పేరుతో విద్యారంగాన్ని కాషాయీకరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకరణ చేస్తోందని విమర్శించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత ప్రదర్శన

చీమకుర్తి: సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కారణంగా సైబర్ నేరాలు సంఖ్య కూడా పెరుగుతోందని సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ ఫర్మేషన్ కౌన్సిలర్ అమృతరాజ్ తెలిపారు. కెనరా బ్యాంక్ సౌజన్యంతో మంగళవారం సీఎఫ్ఎల్ స్వచ్ఛంద సంస్థ నిప్పట్లపాడు గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత ద్వారా అవగాహన కల్పించారు. బ్యాంకుల్లోనే పొదుపు చేసుకోవాలని, రుణాలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఖాతాలను కలిగి ఉండాలంటూ.. ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా సీఎఫ్ఎల్ సంస్థ నిర్వాహకులు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొత్తపట్నం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలు కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అల్లూరు గ్రామానికి చెందిన మిట్నసల సుబ్బారావు మంగళవారం సాయంత్రం కట్టెలు కోసం పొలానికి వెళ్లాడు. తిరిగి ఇంటికొచ్చే సమయంలో కొత్తపట్నం నుంచి ఒంగోలు వెళ్లే ఓ యువకడు ద్విచక్రవాహనంతో అతివేగంగా వచ్చి సుబ్బారావును ఢీకొట్టాడు. తలకు బలమైన గాయం కావడంతో 108 సహకారంతో ఒంగోలు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.సాంబశివరావు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

ఒంగోలు: ఆశ వర్కర్లతో సంబంధంలేని పనులు చేయించవద్దని ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కల్పన డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆమె మాట్లాడారు. ఆన్‌లైన్ పేరుతో జరుగుతున్న వేధింపులు, బెదిరింపులు వెంటనే ఆపాలన్నారు. సీఐటీయూ జివల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, కేవీపీఎస్ జిల్లా నాయకులు రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదుకు రైతులు సహకరించాలి

గిద్దలూరు రూరల్: పంట నమోదు కార్యక్రమానికి రైతులు సహకరించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని తంబళ్లపల్లె గ్రామంలో మంగళవారం రైతులకు ఈ–క్రాప్ నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సంచాలకుల ద్వారా రైతులు వ్యవసాయంలోని సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రతి రైతు వారి పంటలను ఈ–క్రాప్ చేయించుకోవాలన్నారు. వేసవిలో లోతైన దుక్కిలు వేసుకుంటే అనేక లాభాలున్నాయన్నారు. మట్టి నమూనా సేకరణతో రైతులు ఎటువంటి పంటలు వేయాలనే విషయం పూర్తిగా తెలుస్తుందన్నారు. ఏఓలు విజయభాస్కర్‌రెడ్డి, మహబూబ్‌బాషా, గ్రామ వ్యవసాయ సంచాలకులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పత్తిలో పసుపు అట్టలు పెట్టాలి

బేస్తవారిపేట: పత్తి, మిరప పంటల్లో రసం పీల్చే పురుగుల నివారణకు పసుపు, నీలం రంగు అట్టలు ఎకరా పొలంలో 20 పెట్టాలని వ్యవసాయాధికారి జక్కం మెర్సీ అన్నారు. మంగళవారం మండలంలోని పెద్ద ఓబినేని పల్లె, పూసలపాడులో మేలైన వ్యవసాయ సాగు పద్ధతులపై రైతులకు డీఆర్‌సీ ఆత్మ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. లోతైన దుక్కులు దున్నడంతో శిలీంధ్ర అవశేషాలను నాశనం చేయవచ్చని, పత్తి పంట నాటిన 45–75 రోజుల్లో లీటర్ నీటికి మెగ్నీషియం సల్ఫేట్‌ను పిచికారీ చేయాలని సూచించారు. డీఆర్‌సీ వ్యవసాయాధికారి శైలజ, ఉద్యానవనశాఖ అధికారి డి.శ్వేత, ఏపీఎం కె.రఘునాథ్‌బాబు, ఏఈఓలు ఆదిగణేష్ పాల్గొన్నారు.

పాఠశాలల బస్సు పన్ను తగ్గించాలి



మాట్లాడుతున్న అపుస్మా జిల్లా అధ్యక్షుడు మాధవరావు

ఒంగోలు: పెంచిన పాఠశాలల బస్సు పన్నులను తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) జిల్లా అధ్యక్షుడు కె.మాధవరావు డిమాండ్ చేశారు. స్థానిక వీఎస్‌జీ పాఠశాలలో జరిగిన సమావేశంలో మాధవరావు మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల బస్సు పన్నులను మూడు రెట్లు పెంచామని, దీని వల్ల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి బి.హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వ బస్సులు వెళ్ళని గ్రామాలకు ప్రైవేటు పాఠశాలలు బస్సులు నడుపుతూ విద్యార్థులను విద్యనేర్పుకునేలా చర్యలు చేపడుతున్నామన్నారు. అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏవీ సుబ్బారావు మాట్లాడుతూ బస్సు పన్నులు విపరీతంగా పెంచితే ప్రైవేటు పాఠశాలలు మూతపడతాయని, కనుక తక్షణమే రవాణాశాఖ స్పందించి పెంచిన పన్నులను తగ్గించాలన్నారు.

ఓటు హక్కు పొందడం బాధ్యత



మాట్లాడుతున్న తహసీల్దార్ మురళి

ఒంగోలు రూరల్: ఓటు హక్కు పొందేందుకు అర్హత పొందినవారంతా బీఎల్‌వో వద్ద దరఖాస్తు చేసుకోవల్సిందిగా ఒంగోలు తహసీల్దార్ పసుపులేటి మురళి అన్నారు. ప్రజాసొమ్య దేశంలో తమ ప్రతినిధిగా ఎన్నుకునేందుకు ఓటు హక్కు కలిగి ఉండడం ముఖ్యమని ఆ ఓటు హక్కు పొందేందుకు మార్గదర్శక సూత్రాలు పాటించి దరఖాస్తు చేసుకోవలన్నారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శక సూత్రాలను పాటిస్తూ ఏ ప్రాంతం నుంచి దరఖాస్తు చేసుకుంటున్నారో, ఆ ప్రాంతంలో ఉంటున్నట్లు రెండు ధ్రువీకరణ పత్రాలను అందజేయాలన్నారు. ఓటు హక్కు నమోదుకై దరఖాస్తు చేసే సమయంలో మరే ఇతర ప్రాంతంలో ఓటు ఉండకూడదన్నారు. గతంలో పొంది ఉంటే రద్దు చేసుకోవాలని ఆదేశించారు. ఇందుకు మార్గదర్శక సూత్రాలను బీఎల్‌వోలకు, వీఆర్‌వోలకు, గ్రామ కార్యదర్శులకు అందజేసినట్లు ఆ నిబంధనలకు లోబడి దరఖాస్తు చేయాలన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ, ప్రజలు

నాగులుప్పలపాడు: మండల వ్యాప్తంగా దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ సమస్యలపై ప్రణాళిక ప్రకారం పనిచేస్తున్నామని ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. ఉప్పుగుండూరులో మంగళవారం ఏర్పాటు చేసిన విద్యుత్ అదాలత్ కార్యక్రమంలో పలు గ్రామాల నాయకులు, ప్రజలు అధికారుల దృష్టికి సమస్యలు తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన అధికారులు త్వరితగతిన అనుకూలంగా ఉన్న సమస్యలన్నింటిని పరిష్కారం చేస్తామన్నారు. ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి సమస్యలను అధికారులకు తెలియజేశారు. డీఈఈ మోహనరావు మాట్లాడుతూ ఈ అదాలత్ ద్వారా 10 బిల్లులకు పరిష్కారం చూపామన్నారు. బిల్లుల సవరణపై 5 సర్వీసులు రెవెన్యూ అధికారులకు పంపించామని.. లో వోల్టేజీ సమస్యపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపడంతో పాటు ఉప్పుగుండూరులో మాచవరం రోడ్డు, పరబీడు కాలనీలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తిమ్మసముద్రం, పోతవరం, తక్కెళ్ళపాడు, కనపర్తి, అమ్మనబ్రోలులో ప్రతిపాదనలు పంపామన్నారు. ఏఈ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వాతావరణంలో మార్పులపై సదస్సు



మాట్లాడుతున్న సాయిబాబా సెంట్రల్ స్కూల్ విద్యార్థులు

ఒంగోలు: వాతావరణంలో మార్పులపై సాయిబాబా సెంట్రల్ స్కూల్‌లో చిన్నారులకు అవగాహన సదస్సు మంగళవారం 6వ తరగతి విద్యార్థులు నిర్వహించారు. వాతావరణంలో కలిగే మార్పులు–కారణాలు, నివారణా చర్యలు అనే అంశంపై విద్యార్థులు అర్థవంతంగా చర్చించారు. చర్చలు, లఘు నాటికలు, నృత్యాల ద్వారా ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ శృతి సాయినాథుని అభినందించారు. కరస్పాండెంట్ జీవీ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను ప్రకృతిపట్ల అవగాహన కలిగించే విధంగా కార్యక్రమం చేపట్టామని ఇందుకు తల్లిదండ్రుల నుంచి లభించిన ప్రోత్సాహం తమను సంతోషపరిచిందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ యం.మహేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు



దొనకొండ: మాట్లాడుతున్న లక్ష్మీరెడ్డి



దర్శి: పట్టలు, స్ప్రేయర్‌లు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

దర్శి: పంట మార్పిడి అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని సహపరిశోధనా సంచాలకులు డాక్టర్ జీఎమ్‌వీ ప్రసాదరావు సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ఐకార్ 95వ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని సాంకేతిక వారోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కంది ఎఆర్‌జీ 105 విత్తనాలు, టార్పాలిన్ పట్టలు, స్ప్రేయర్‌లు ఉచితంగా పంపిణీ చేశారు. జీఎమ్‌వీ ప్రసాద్‌రావు, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్‌వీవీఎస్ దుర్గాప్రసాద్, డాక్టర్ ఎం. ఉష, డాక్టర్ ఎం. శివ, డాక్టర్ టీవీ రెడ్డి, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ లీలాకృష్ణ, టి. మానస పాల్గొన్నారు.

దొనకొండ: మండలంలోని పోలేపల్లిలో రిలయన్స్ ఫౌండేషన్, ఎఫర్డ్ ఆధ్వర్యంలో ఖరీఫ్ సీజన్‌లో మిరప పంట సాగుపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జెస్సీ గ్లోరీ, సుధారాణి, గ్రామ రైతులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెస్ టీం ఎంపిక

ఒంగోలు: జిల్లా స్థాయి చెస్‌టీమ్‌ను ఎంపిక చేసినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్‌కే అబ్దుల్ నబీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రాజా పానగల్ రోడ్డులోని టాలెంట్ చెస్ అకాడమీలో నిర్వహించిన పోటీల్లో పమిడి జస్వంత్, పోలూరి కుమారస్వామి, బాల వెంకట నరేంద్ర, వేణుగోపాల్ రెడ్డి వరుస నాలుగు స్థానాల్లో నిలిచారన్నారు. ఎంపికైన వారు ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.